# తరంగాలు

ఆచార్య జి. అరుణకుమారి

తెలుగు సాహిత్యంలోని కొన్ని కథలను, నవలలను, సాహితీ యాత్రను, అనువాద నవలలను గ్రహించి సాయంత్ర సమయంలో సాహిత్య చర్చా గోష్టిని సామూహిక తరంగాలుగా నెరపిన హైదరాబాద్ సాహితీ సమితి, సాహితీ సమూహానికి గొప్ప వారధిలా తరంగాల అంతరంగ మథనం చేసి తరతరాల అంతరాలను అందించిన సాహిత్య సృష్టి కర్తలకు అభినందనలు.

ఉపన్యాసం ప్రక్రియా రూపం ధరించినట్లే ఈ చర్చాగోష్టి ఈవినింగ్ టాక్స్ ప్రక్రియా రూపాన్ని ధరించవచ్చు. ఒక తరం అంటే ముప్పై సంవత్సరాల కాలం. రెండు, మూడు, ఏడు తరాలను సూచిస్తూ తరాలలోని అంతరాలను గుర్తిస్తూ రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, మత పరిస్థితులను ఉద్యమ చైతన్యాన్ని అసమానతలను ప్రతి ఫలింప చేస్తూ దళిత నవలలు వెలువడ్డాయి. ఏడు తరాల బానిసత్వాన్ని వెల్లడి చేస్తూ ఎలెక్స్ హేలి రాసిన ఆంగ్ల నవల రూట్స్ అంటరాని వసంతానికి స్ఫూర్తిగా నిలిచింది. రూట్స్ నవలలోని వసంతకాలం, ఏడుతరాల బానిసత్వం, న్యొబొటో చెప్పిన జానపద కథ, మార్టిన్ మతబోధకుడు బానిసత్వం ఉండకూడదని వాదించిన అమెరికా అధ్యక్షుడు అబ్రహం లింకన్ ... ఈ విషయాలన్ని భారతీయ కోణంలో మలచబడి అంటరాని తనాన్ని ఆర్థిక,

సామాజిక, సాంస్కృతిక, రాజకీయ కోణల్లో చూపించి ఏడు తరాల దళిత జీవన వ్యధలను అంటరాని వసంతంలో రచయిత కళ్యాణ్ రావు  చూపించారు.

ఈ చర్చా గోష్టిలో రచయితలు స్పృశించని కోణాలను, దర్శించని సిద్ధాంతాలను, సూత్రాలను, ఉద్యమ స్ఫూర్తిని, లుప్తమైన ప్రధాన సంఘటనలను, పాక్షిక దృష్టిని ఈ సాహితీ సమూహం ప్రశ్నించింది. పాత్రల వ్యక్తిత్వాలను నిశితంగా వ్యక్తం చేయటం, కథన పద్ధతి, భావజాలాన్ని విమర్శనాత్మక దృష్టితో చూడటం ప్రశంసనీయం. నల్లమిరియం చెట్టు నవల గుంటూరు జిల్లా నేపథ్యంలో ప్రారంభంమైన కథ. అట్టడుగు వర్గ ప్రజల ప్రతిభకు గుర్తింపు లేక పోవటం వర్గపోరాటమే దళిత సమస్య పరిష్కారానికి నిర్ణీత పరిష్కారమార్గంగా ఈ నవల సూచిస్తుంది. మూడు తరాల జీవిత చరిత్రను నల్లమిరియం చెట్టు నమోదు చేస్తుంది. దండోరా ఉద్యమ క్రమంలో అనేక సాంఘిక అసమానతలను ఎదుర్కొంటూ వర్గీకరణ సాధన కోసం ప్రాణాలను ఫణంగా పెట్టి సాధిస్తానని రాజయ్య కార్యకర్తల జేజేల మధ్య చెబుతాడు. నిరాహార దీక్ష చేసే ప్రాంగణంలో పది సంవత్సరాల పిల్లవాడు కిరోసిన్ పోసుకుని తగలబెట్టుకోవటం  ఈ నవలలో ప్రధాన విషయం. దండోరాను రాజకీయ నిచ్చెనగా చేయవద్దని రూమి అంటాడు. మాదిగల కుంటుంబ జీవనాన్ని గురించి మాదిగల సామాజిక ఆర్థిక, సాంస్కృతిక, మత పరిస్థితుల గురించి ప్రస్తావించారు నల్లమిరియం చెట్టు నవలా రచయిత డా. వి. చంద్రశేఖర్ రావు. చర్చలో రాజకీయ ఎత్తుగడల నేపథ్యంలో మనస్తత్వాలను ప్రదర్శించటం, విశ్లేషించటం బాగుంది. దండోర చైతన్యపు

ఆత్మగౌరవాన్ని ప్రస్తావించక పోవటాన్ని ప్రశ్నించారు. మాల మాదిగల మధ్య వైవిధ్యం, దండోరా ఉద్యమ ప్రభావం గురించి అనేక ప్రశ్నలను ఈ చర్చాగోష్టి లేవనెత్తింది. నల్లూరి రుక్మిణి ఒంద్రుమట్టి నవల ప్రకాశం జిల్లా నుండి తెలంగాణకు వలస వెళ్ళిన వ్యవసాయ కుటుంబాల మూడు తరాల జీవన చిత్రణ. స్వాతంత్రానికి పూర్వం, స్వాతంత్రానంతరం, సుమారు అరవై సంవత్సరాల కాలంలో ఏర్పడిన రాజకీయ, మత, ఆర్థిక, సామాజిక మార్పులను బాహ్యంగా చెప్పినా వివక్ష, అణచివేతల వంటి దౌర్జన్యాలను చదువుల వల్ల కూడ అధిగమించలేక పోయాయని రచయిత్రి చెబుతుంది. మూడు తరాల్లో కనిపించే జీవిత పయనం, వ్యక్తులలో, వ్యవస్థలో, మానవ సంబంధాలలో మార్పులు ఏ విధంగా చోటుచేసుకున్నాయో ఈ నవల చెబుతుంది. ఈ వేదిక యాభై సంవత్సరాల కథలో చారిత్రక పరిణామం కనిపించలేదని వస్తు ప్రాధాన్యతను గుర్తిస్తూ దీన్ని గురించి ప్రశ్నించింది.

నవీన్ కాలరేఖలు నవలలో మధ్యతరగతి వ్యవసాయ కుటుంబానికి సంబంధించిన కథ. రజాకార్ల దాడులకు భయపడి మచిలీపట్నానికి వెళ్ళిన కుటుంబం చుట్టు కథ నడుస్తుంటుంది. కమ్యూనిస్టుపార్టీ తమ కార్యకలాపాల ద్వార ప్రజల్ని సంఘటిత పరిచినటువంటి విధానం ఇందులో కనిపిస్తుంది. ఉద్యమాల వల్ల కుటుంబాలపై పడిన ప్రభావాన్ని వివరంగా తెలిపిన నవలగా గుర్తించవచ్చు. చారిత్రక విషయాలకు ప్రాధాన్యమిచ్చే నవలగా గుర్తించవచ్చు. ఒక ఆర్థిక, రాజకీయ, సామాజిక కోణాలను అందించిందనటంలో ఏమాత్రం

సందేహం లేదు. ఈ నవల గురించి సాహితీ సమితి జరిపిన చర్చ పరిశోధనత్మకంగా ఉంది.

ఒక మనిషి–ఒక ఇల్లు–ఒక ప్రపంచం తమిళ రచయిత జయకాంతన్ రచించిన ఒరు మణిదన్ – ఒరు వీడు – ఒరు ఉలగం నవలకు తెలుగు అనువాదం. మనిషి మానసిక స్థితిని చిత్రించడంలో రచయిత చూపిన ప్రతిభ ఆయనకు ఆంగ్ల సాహిత్య అధ్యయనం వల్లనే కలిగిందని విమర్శకులంటారు. బరువైన జీవిత సత్యాన్ని ఎత్తి చూపడంలో ఈ రచన పేర్కొనదగినది. మతాలకు, విద్యకు అతీతంగా నడిచింది ఈ నవల. జయకాంతన్ చిన్నతనంలో బడికి వెళ్ళి చదువుకోలేదు. స్వయంగా చదువుకుని పైకి వచ్చాడు. ఆ కోణాన్నే ఈ నవలలో రూపొందించారు. మంచి వాళ్ళలా ఉండడం అనేది ఊహా ప్రపంచం అని అన్నారు. విద్యకు, మతానికి చట్రంలో బిగించబడిన విలువలకు అతీతంగా మనిషి జీవించగలడు. నిజజీవితంలో సాధ్యాన్నే జయకాంతన్ రాసారు. ఉత్తమునిగా తీర్చి దిద్దడానికి ఏమతమూ అవసరం లేదు. ఉదాత్తమానవ సంబంధాలను జయకాంతన్ నవల చూపిస్తుంది.

ఒక వ్యక్తిని మరో వ్యక్తి దోపిడి చేయడాన్ని చావుని కూడా వ్యాపారంగా మార్చుకునే వ్యవస్థని మరణానంతర జీవితం నవలలో నందిగం కృష్ణారావు చూపించారు. కృత్రిమ విలువల్ని ఏర్పరచుకుని బ్రతికే బ్రతుకులను గురించి ఈ కథలు వివరిస్తాయి. ఆత్మీయం కథల్లో దాసరి అమరేంద్ర శేషాలిక కథలో చెట్లను పలకరించడం, చెట్లు మాట్లాడడం ఒక ఫాంటసి అని అన్నారు. వస్తువులకు

చైతన్యం ఉంటుందని తాత్వికులు, భారతీయులు విశ్వసిస్తారు. ఇది వాస్తవమనిపించే సందర్భాలు కొన్ని జీవితాల్లో కనిపించనూ వచ్చు. పువ్వులు పలకరిస్తాయి, అసూయ చెందుతాయి, సందేశాలనందిస్తాయి అన్నది కూడా అనేక భాషల్లో వ్యక్తం చేసినటువంటి భావాలే.

సామాన్య హెచ్.సి.యు విద్యార్థిగానే రచనలు కొనసాగించింది. సామాన్య కథల్లో దొంగలు, రాజకీయ నాయకులు, ప్రజలను దోచుకోవటం. ఆధునిక స్త్రీల జీవితాల్లోని భిన్నకోణాలను దర్శింపజేస్తాయి. అన్యాయానికి గురైన ఆడపిల్లలను ఆదుకోవల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని ఇరుప్రాంతాల ప్రేమికుల మధ్య భావోద్వేగాలను వ్యక్తీకరించే కథలను రచించారు. న్యూక్లియర్ కుటుంబాల కథలను ప్రధానంగ చిత్రించారు. ‘ ఏం మాట్లాడితే ఏ ముద్రవేస్తారో అన్న భయంతో మాట్లాడాల్సిన పరిస్థితి ఒకటి ఈ సమాజంలో నెలకొని ఉండటం విషాదకరం. ప్రతి వ్యక్తి స్వతంత్రంగా అభిప్రాయాలను వ్యక్తీకరించే అవకాశం ఉండాలంటారు…’

ఈ క్రమంలో ఈ పుస్తకంలో కొన్ని నవలలు, కొన్ని కథలు కనిపిస్తాయి. అందులో నవలల్లోనే సమస్యలకు పరిష్కారమార్గంగా కమ్యూనిజం, ఉద్యమ చైతన్యం, పోరుబాటగ నడిచిన కథనాలు, క్రాంత పరమైన నవలల్లోని, ఆ నవల్లోని కథా వస్తువుల్లో వలసపోయిన  వ్యవసాయ కుటుంబాలు, బానిస బతుకులు ఇవన్నీ కూడా అందులోని ఏకసూత్రతను పాటిస్తున్నటువంటి ఒకానొక నేపథ్యం అనేక కోణాల్లోని సమస్యల్ని సూచిస్తూ ఆ సమస్యలకు పరిష్కారాన్ని అందిచే

క్రమంలో ఈ చర్చావేదిక వాటన్నిటినీ కూడా చర్చించింది. ప్రశ్నించటం ప్రగతికి మార్గం. ప్రశ్నలు ఉద్దేశాలను, రహస్యాలను, తెలుసుకోవటానికే. ఆలోచనకు, అనుభూతికి, అనుభవానికి ప్రశ్నలు దారితీస్తాయి. దీని వల్ల ప్రయోజనం ఉపయోగం అన్నది పరమార్థం. ఆ ప్రయత్నం వైపుగ పయనించే సామూహిక తరంగాలకు అభినందనలు. రచయిత ఏవిధంగ రాస్తే బాగుంటుందన్న విషయాలను పరిశీలించి ప్రశ్నించిన ఈ చర్చ వేదికను అభినందిస్తున్నాను.

**ఆచార్య జి. అరుణ కుమారి.**

**హైదరాబాద్ విశ్వవిద్యాలయం.**

04 సెప్టెంబర్ 2015